# ఎందెందు వెదకి చూసిన....

-చిలుకూరి దేవపుత్ర

'ప్రపంచంలో మనకి ఎన్నో విషయాలు తెలుసనే అజ్ఞానంలో బతుకుతూ వుంటాం. నల్లని వన్నీ నీళ్ళనీ, తెల్లనివన్నీ పాలనీ, పచ్చనిదంతా పసరనీ, ఎర్రనిదంతా మందనే భ్రాంతిలో బతుకుతుంటాం.' అన్న విషయం ఎప్పుడు తెలుస్తుంది మనకీ?

ఎప్పుడంటే - మా సుబ్రమణ్యం మామ లాంటి వాళ్ళని చూసినపుడు.

చూడగానే సరికాదు - అట్లాంటి వాళ్ళతో అరగంట మాట్లాడినపుడు.

అవున్నిజం!!!

అప్పుడు తెలుస్తుంది మరి!

నీళ్ళకీ, పాలకీ, పసరుకీ, మందుకీ ఉన్న వ్యత్యాసం... ఏ రంగులో ఏవి వున్నా, వాటికి ఆ రంగులు ఎట్లా వచ్చినాయో ఆ రంగుల్లో అవి లేకుండా కూడా ఎట్లా పొందవచ్చునో కూడా, చెబుతాడు సుబ్రమణ్యం మాకు. నా చిన్నప్పటి నించే ఆయన పరిచయమయి ఉంటేనా ఇట్లా కలెక్టరాఫీసులో గుమస్తాగా ఎందుకుందునూ, చక్కగా ఈ పాటికి ఏ ఫిలాసఫీ ప్రొఫెసర్‌గానో, ఐ ఏ ఎస్ ఆఫీసరుగానో అయివుండే వాడిని.

నిజం- నాకు సుబ్రమణ్యం మామ పరిచయమైనాక ఆయనతో గడిపిన ఆ రెండు రోజులూ, అబ్బో - ఎన్ని విషయాలు తెలుసుకున్నానో!

ఆయన నాకు స్వంత మామ ఏమీ కాదు. మా ఆవిడ వాళ్ళమ్మకి, అంటే మా అత్తగారికి వేలు విడిచిన మేనమామ కొడుకు.

సంవత్సరం క్రితం మా మరదలి పెళ్ళిలో ఉదయం తలంబ్రాలు అవగానే భోజనాలు చేస్తున్నప్పుడు, నా పక్కన ఏభై ఏళ్ళ బట్టతల మనిషి కూచుని తన పక్కనున్న మనిషితో అమెరికా ప్రపంచ పోలీసుగా ఎట్లా వ్యవహరిస్తూ ఉన్నదో చెబుతున్నాడు. ఆయనెవరో మంచి సరుకున్న మనిషే అనుకున్నాను. పందిరి కింద తాంబూళాలు నములుతూ వుంటే మా ఆవిడ వచ్చింది. "ఏమండీ, మా సుబ్రమణ్యం చిన్నాన్న మీకు పరిచయం లేదా?" అంది. నేను నవ్వుతూ ఆయనతో కరచాలనం చేస్తూ "లేదు కానీ, ఇందాక భోజనాల దగ్గర ఆయన మాటలు పరిచయమయ్యాయి." అన్నాను మా ఆవిడతో. ఆ తర్వాత మా ఇద్దరికీ మాటామాటా కలిశాయి. మా అత్తగారి ఇంట్లో రెండు రోజులపాటూ ఒకే గదిలో సెటిలయిపోయాం. ఆయన మాటలు - నిజంగా చాలా ఆకట్టుకున్నాయి నన్ను.

ఆ రాత్రికి పక్కలు వేసుకుని మంచాలపై ఎదురెదురుగా కూచున్నాం - సిగరెట్లు తాగుతూ.

ఉన్నట్లుండి "అవినీతి అంటే ఏమిటి?" అని ప్రశ్నించాడు సుబ్రమణ్యం మామ.

ఆయన అడిగిన తీరుకు వెంటనే సమాధానం చెప్పాలంటే నాకు కొంచెం జంకుగానే అనిపించింది. అసలు ఆయన అడుగుతోంది 'అవినీతి'కి అర్థమా? లేకుంటే నిర్వచనమా? అని కాసేపు తటపటాయించి, సిగరెట్టు సీరియస్‌గా తాగుతూనే అయోమయంగా చూశాను నేను.

అయితే నా అదృష్టం కొద్దీ పెద్దగా నన్ను ఇబ్బంది పెట్టకుండానే ఆయనే చెప్పనారంభించాడు.

అవినీతంటే లంచగొండితనం అవునా? అనేసి నా వైపు రెప్పవేయకుండా చూశాడు.

నేను 'అవును' అని తలాడించానే అనుకోండి. ఆయన 'కాదు' అనేయగలడని నాకు తెలుసు. పొద్దున్నించీ ఆయన ధోరణి నాకు బాగా అర్థమైపోయింది. అందుకే నేను "ఊఁ" అన్లేదూ, "ఊహూఁ" అన్లేదు. ఆయన వైపు సీరియస్‌గా చూస్తూ సిగరెట్టుని గుప్పుగుప్పుమని లాగాన్నేను. ఆయన మాత్రం సిగరెట్టుని చివరి పీల్పు పీల్చి యాష్ ట్రేలో దాన్ని నలిపేసి; నువ్వు అవునన్నా నేను ఒప్పుకోను పరమేశం!" అన్నాడు నవ్వుతూ.

హమ్మయ్య, బ్రతికిపోయినాను. నేను 'అవును' అనుంటే, అతని దృష్టిలో దద్దమ్మనైపోయే వాడిని.

"అవినీతంటే నీకే కాదు చాలామంది దృష్టిలో లంచగొండితనమే - యాభై రూపాయలు లంచం తీసుకున్న గుమస్తానీ, వంద రూపాయలు లంచం తీసుకున్న డాక్టర్నీ ఏ.సి.బి. వాళ్ళు వలవేసి మరీ పట్టుకుంటున్నట్టు మనం అప్పుడప్పుడు పేపర్లో చదివేస్తుంటాం. అందుకే అవినీతి అంటూనే అందరికీ లంచమే గుర్తుకు వస్తూ వుంటుంది. అయితే అవినీతి అన్నది ఒక్క ఉద్యోగుల విషయంలోనే ఉండదయ్యా, నీతి బాహ్యంగా చేసే ప్రతిపనీ అవినీతేనని నా నిర్వచనం." అంటూ సుబ్రమణ్యం మామ మానవాళికి కొత్త సత్యాన్ని కనిపెట్టిన ప్రవక్తలా నవ్వుతూ చూశాడు నావైపు.

'అంటే'? అన్నాను మరింత అయోమయంలో.

"అంటే గింటే ఏముంది - నువ్వు సినిమా టికెట్ల కోసం క్యూలో నిలుచుని ఉంటావు. టికెట్లు దొరకవేమోనని బ్లాకులో కొంటావు. మరి అది అవినీతే! అట్లా కాకుండా ఆ క్యూలో నీ కంటే పదిమంది ముందు నిలుచున్న మిత్రుని ద్వారా టికెట్లు పొందాలని చూస్తావు. అది మరి అవినీతే! ఏమంటావు? నువ్వు బుద్ధిగా క్యూలో నిలబడి నీ వంతు టిక్కెట్టు న్యాయంగా పొందటమే నీతి. ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే. దీన్ని బియ్యం, గోధుమ, కిరోసిన్ లాంటి నిత్యావసర వస్తువుల్నీ పొందడంలో కూడా అప్లయి చేసుకోవచ్చు. ఇంకో ఉదాహరణ ఇస్తానబ్బాయ్! నీకు మరింత బాగా అవగాహన అవడం కోసం - నువ్వు మెడికల్ షాపుకి వెళతావు. అక్కడ నూరు రూపాయల మందులు కొంటావు. డబ్బిచ్చేసి మందుల్ని చక్కగా ఇంటికి తెచ్చుకుంటావు." అంటూ చెబుతున్నాడు ఆయన.

ఇదేం ఉదాహరణరా బాబూ! డబ్బులిచ్చి మందుల్ని ఇంటికి తెచ్చుకోక ఎక్కడైనా పారేసి వస్తామా?" అని నాలో నేను గొణుక్కుంటూ ఉండగానే-

"అక్కడే వుంది పరమేశం అవినీతి" అన్నాడు మరో సిగరెట్ అంటించుకుని వింతగా నావైపు చూస్తూ.

మళ్ళీ ఏదో ఫిటింగ్ పెట్టేస్తున్నాడు, అనుకున్నా.

" ఎస్, అక్కడ వుంది - మెడికల్ షాపులో మందులు అమ్మిన షాపు వాడు బిల్లు అన్నది ఎవరికైనా ఇస్తాడా?" అంటూ మిర్రి మిర్రి చూశాడు నావైపు.

'ఇవ్వడు' అన్నాను కచ్చితంగా.

"ఎందుకివ్వడు?" అంటూ ప్రశ్నించాడతను.

''ఏమంత అవసరం?'' అంటూ ఎదురు ప్రశ్నవేశాన్నేను.

"అక్కడే వేశావు పప్పులో కాలు. మెడికల్ షాపు వాడు నీకు బిల్లు ఇవ్వలేదూ అంటే ప్రభుత్వానికి కట్టవలసిన పన్నుని ప్రత్యక్షంగా ఎగ్గొట్టేస్తున్నాడన్నమాట! మరి అది అవినీతే! నువ్వా బిల్లుని అడిగి తీసుకోలేదంటే నిస్సందేహంగా నువ్వూ అవినీతికి పాల్పడ్డట్టేనన్నమాట! ఇది ఒట్టి అవినీతే కాదు దేశద్రోహం కింద లెక్క వేయవచ్చు. అవును మరి దేశ ఆర్థిక స్థితిని కుంటుపడేట్టు చేయడంలో నీ వంతు కృషి కూడా వున్నదన్న మాట. తెలుసునా? ఇట్లానే కిరాణా కొట్టువాడు మొదలుకొని బంగారు షాపువాడి వరకూ ఎవరూ బిల్లులు ఇవ్వరు. కొనేవాడు ఎవ్వడూ బిల్లులు ఇచ్చి తీరాలని డిమాండ్ చేయరు. ఇలా ప్రతి మనిషీ అనునిత్యం తన శక్తి మేరకు అవినీతికి పాల్పడుతుంటే దేశమేగతి బాగుపడుతుంది పరమేశం!" అంటూ నవ్వుతూ చూశాడు.

ఆయనలా చెబుతూ ఉంటే శ్రీకృష్ణుడు గీతోపదేశం చేసన్తా వుంటే వింటున్న అర్జునుడిలా వోన్ట్ ఒబీడియంట్‌గా చూస్తున్నాను, సుబ్రమణ్యం మామని.

ఆ మరుసటిరోజు ఉదయం పళ్ళు తోముకుంటూ వరండాలో నిలుచుని వీధిలోకి చూస్తూ వున్నాను.

"చూశావా! పరమేశం! ఆ ఇంటి వాడి కక్కుర్తి" అంటూ ఎదురింటివైపు చూపించాడు సుబ్రమణ్యం మామ. పళ్ళు తోముతున్న బ్రష్షుని జండా కొయ్యలా ఎత్తి పట్టుకుని.


ఎదురింటి వైపు చూశాను.

ఆ కక్కుర్తి పడ్డ ఇంటాయన కనిపించలేదు. పోనీ ఆ ఇంటికున్న అవకరమేమీ కనిపించనూ లేదు. పైగా ఆ ఇల్లు చక్కగా గులాబి రంగులో చూడ ముచ్చటగా ఉంది. నగిషీలు చెక్కిన వాకిళ్ళు నిగనిగలాడుతూ ఉన్నాయి. కాసింత స్థలంలో కూడా ఎంతో ఆకర్షణీయంగా కట్టవచ్చునని రుజువు చేసినట్టుంది. ముచ్చటయిన చిన్ని కాంపౌండు కూడా ఉందా ఇంటికి.

" ఆ ఇంటాయన పడ్డ కక్కుర్తి కనబడలేదేం పరమేశం!" అంటూ మళ్ళీ అడిగాడు సుబ్రమణ్యం మామ.

"లేదు మామా!" అన్నాను - ఆయన మొహంలోకి చూసి నా బేలతనం ఒప్పుకోలేక.

సుబ్రమణ్యం మామ చెప్పనారంభించాడు- " ఆ ఇంటి హద్దు మునిసిపాలిటీ వాళ్ళ మురికి కాలువ అవతలే - అవునా... కానీ ఆయన ఆ మురికి కాలువ మీదే చిన్న కాంపౌండు కట్టాడు చూడు - అది వాడి



అబ్బగంటా? ఇంకా అటువైపు చూడు ఆ ఇంటికి పక్కనే టాయిలెట్ రూం వుంది, అవునా దాని 'పిట్' ఎక్కడ పెట్టాడో చూడూ మునిసిపల్ స్థలంలో... అది ఎంత తప్పో చూసినావా? అసలు ఆ 'పిట్' అక్కడ పెట్టవచ్చునా? దాని పక్కనే పబ్లిక్ బోర్‌వెల్ వుందికదా. దాన్లోకి ఆ దరిద్రపు నీళ్ళు కలసి నీటిని అశుభ్రంగా మార్చవూ? పది మందీ వాడే నీళ్ళు కదా అవి. ఇదయ్యా అవినీతికి పరాకాష్ఠ అంటే! ఇలాంటి దేశద్రోహుల్ని తుపాకీతో షూట్ చెయాలి!" అంటూ ఉద్రేకంతో ఊగిపోయినాడు కూడా.

సుబ్రమణ్యం మామ ఆ మధ్యాహ్నం ఊరికి బయల్దేరి వెళ్తూ 'కర్నూలుకు వచ్చే వేసని సెలవుల్లో మీరు తప్పక రావా'లని నాకూ, మా ఆవిడకీ పదేపదే చెప్పి వెళ్ళిపోయినాడు.

ఆయన వెళ్ళిపోయినాక ఆయన మాటలన్నీ మా ఆవిడకి చెప్పాను.

ఆవిడ నాలాగా ఆశ్చర్యపోలేదు. నవ్వి ఊరుకుంది. ఈ ఆడవాళ్ళకి దేనికి ఆశ్చర్యపోవాలో దేనికి పోకూడదో తెలీదు. ఒక వందేళ్ళు వెనుకబడి వుంటారు. మీ ఆడవాళ్ళు" అన్నాను కసిగా.

"అవునవును మీ మాదిరి ప్రతి చిన్నదానికి ఎక్కడ చలించిపోయేది లేండి." అంది మరోమారు నవ్వుతూ.

ఇంతకీ సుబ్రమణ్యం మామని గురించి ఎందుకు చెబుతున్నానంటే–

రెండు రోజుల క్రితం – వేసవి సెలవులకి కర్నూలుకి రావలసిందిగా కోరుతూ ఉత్తరం రాశాడు ఆయన. "వచ్చే సోమవారం మెయిన్ బజారులో ఉన్న మా బాలాజీ ఎలక్ట్రికల్ షాపులో ఉదయం పది గంటల నుంచీ మీ కోసం ఎదురుచూస్తూ వుంటాను" అని కూడా రాశాడు.

కర్నూలుకి వెళ్ళి తీరాలని మా పిల్లలూ, మా ఆవిడా పట్టుబట్టడంతో బయల్దేరక తప్పింది కాదు.

* * *

కర్నూలులో బస్సు దిగగానే ఆటోలో సుబ్రమణ్యం మామ షాపు చేరుకున్నాం. అప్పుడాయన అక్కడ లేడు. తొందరగానే వస్తాడని చెప్పాడు సేల్స్‌మేన్. మధ్యాహ్నం అయినందువల్ల షాపు అంత రద్దీగా లేదు. అప్పుడొకరు, అప్పుడొకరు వచ్చి ఏ బల్బో, ఏ టూ పిన్ ప్లగ్గో, ఏ స్విచ్ బోర్డో, ఏ సిల్క్ వైరో కొనుక్కొని పోతున్నారు. ఎదురుగా హోటల్లోంచి మా పిల్లలకి ఐస్‌క్రీం తెచ్చి ఇచ్చాను. ఆనందంగా తింటున్నారు వాళ్ళు. మా ఆవిడా, నేను ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. అరగంట తర్వాత సుబ్రమణ్యం మామ వచ్చాడు. మమ్మల్ని, పిల్లల్నీ సంతోషంగా పలకరించాడు. వెంటనే ఆటోలో ఇంటికి తీసికెళ్ళాడు.

ఆయన భార్య అప్పటికే మాకు భోజనాలు సిద్ధం చేసి ఉంచింది. కాబట్టి వెంటనే మా ఆకలి మంటల్ని చల్లార్చేశాం. రాత్రి భోజనాలు అయినాక మేడమీద గదిలోకి చేరుకున్నాం. అప్పటికే మాకు పక్కలు రెడీగా ఉన్నాయి. మా పిల్లలు అలసిపోయారేమో వెంటనే నిద్ర కుపక్రమించారు. మేమిద్దరం తాంబూలాలు నములుతూ మేడ వరండా చివర్లో కూచున్నాం. వీధి దీపాల వెలుతుర్లో రోడ్లనీ, జనసంచారాన్నీ చూస్తూ.

"ఏమండీ! సుబ్రమణ్యం చిన్నాన్న వాళ్ళ షాపులో కూచున్నప్పుడు, అక్కడ మీరు ఒక విషయాన్ని గమనించి ఉండాలి." అంది మా ఆవిడ.

"ఏ విషయమే" అన్నాను పరధ్యానంగా.

"ఆయన షాపులో కూడా ఏ కస్టమర్‌కీ బిల్లులు ఇవ్వడం లేదు. అంటే ఆయన కూడా అవినీతికి దూరం కాదన్న మాట." అంది.

"అట్లనా నేను గమనించలేదే!" అన్నాను.

"అంతే మీరు – ఆడవాళ్ళకి తెలివి తేటలు వుండవనీ ఎద్దేవా చేయడమైతే చేస్తారు గానీ, అసలు మీ మగవాళ్ళని అనాలి, పైకి చెప్పేదొకటీ చేసేదొకటి." అందావిడ.

"ఇదేమిటే నీ దాడి ఉన్నట్టుండీ!" అన్నాను.

"దాడి కాదండీ, నిజానిజాలు! ఎందెందు వెదకి చూసిన, అందందే కలదు అవినీతి – చూడగలిగితే..." అంటూ బమ్మెర పోతన పద్యానికి పేరడీ చేస్తూ నవ్వింది.

"అవునూ ఈ పేరడీ లేమిటే – నీ విపరీతమైన తెలివితేటలతో నన్ను మూర్ఛపోగొట్టాలని ప్రయత్నమా?" అన్నాన్నేను కంగారుగా.

ఆవిడ తాంబూలం నోటితో ఎర్రగా నవ్వుతూ–

"మీ కింకా చూపిస్తాను ఇట్లారండి" అంటూ డాబా వరండాలోకి వెళ్ళి నిలబడి "ఇంకొంచెం ఇట్లారండి, ఈ డాబా ఎక్కడి వరకూ ఉందో కిందికి చూడండి... కింద వున్న మునిసిపల్ స్థలం దాటింది. అంటే నేలమీద ఆక్రమణ తప్పుగానీ గాలిలో ఆక్రమణ తప్పుకాదన్నమాట సుబ్రమణ్యం చిన్నాన్నకు" అంది ఆవిడ.

నిజమే ఆ డాబా మునిసిపల్ స్థలాన్ని గాలిలో ఆక్రమించింది.

ఇంతకు మునుపు ఆడవాళ్ళని వందేళ్ళు వెనకబడ్డారని అనుకున్నందుకు సిగ్గుపడ్డాను.